## క్రీడా పోటీలో గాయపడిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు ,మార్చి 19, ప్రభాతవార్త**
విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్న విషయం విధితమే.ఈ పోటీలలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.ఈ క్రీడా పోటీలలో పాల్గొన్న సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గాయపడ్డారు.క్రికెట్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ కింద పడిపోవడంతో ఆయన ముఖానికి గాయాలయ్యాయి. వెంటనే వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. కుట్లు వేయవలసి ఉండటంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్‌లో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు మూతి వద్ద కుట్లు వేశారు. తదుపరి ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు.ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను పలువురు ఫోన్లో విడిగా పరామర్శించారు.

### జాతీయ గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా అధికారిణి బేబిరాణి



**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పశువుల హాస్పిటల్‌లో బుధవారం జరుగుచున్న జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ కే.బేబిరాణి పరిశీలించారు. ఈ టీకాలు వల్ల కలిగే ఉపయోగాలపై పశుపోషకులకు జిల్లా అధికారిణి డాక్టర్ బేబిరాణి తెలియజేశారు. వేసవిలో పశువులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు.54 పశువులకు ఈ టీకాలు వేశారు.పశువైద్యాధికారి డాక్టర్ పి.చిరంజీవి, పశువైద్య సిబ్బంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు



**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట-1 మంగమూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంనిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని ఆయా గ్రామాల రైతులతో సమావేశం జరిపి రైతులు సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు, ఈకేవైసీ రబీ సీజన్‌లో పూర్తయిందని తెలిపారు. ఆయా జాబితాలను సోషల్ ఆడిట్ గ్రామ సభల ద్వారా రైతులందరికి తెలియపరిచామన్నారు. ప్రస్తుతం రైతులకు 50 రాయితీపై ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందిస్తుందని, కావాల్సిన రైతులు అవసరమైన పత్రాలను తీసుకొని రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల్ని కలవాలని తెలియజేశారు. ఇప్పటి వరకు భూసార పరీక్షలు చేయించుకోని రైతులు ఉన్నట్లయితే చేయించుకోవాలన్నారు. మండలంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందని రైతులు వెంటనే వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. క్లస్టర్ డెమోనిస్ట్రేషన్ ప్రోగ్రాంలో భాగంగా మంగమూరులో సాగు చేసి ఉన్న శనగ పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వివి శేషమ్మ పాల్గొని ప్రస్తుతం సాగు చేసి ఉన్న శనగ పంటలో యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ గురించి వివరించారు. రైతులు పలు పంటలలో అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, పేర్నమిట్ట, మంగమూరు గ్రామాల వ్యవసాయ సహాయకులు సి.జానకి, సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

### సేవాసంకల్ప ట్రస్టు ఆధ్వర్యంలో 43వ వారం అన్నదాన వేడుకలు



**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో బుధవారం నాడు సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతలు సహకారంతో 43వ వారం పేద వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహించారు. ట్రస్టు సభ్యులు దాచర్ల శివయ్య, నల్లూరు శేషయ్యల తాతయ్య, అమ్మమ్మలు లైన బొడ్డు కృష్ణయ్య, పిచ్చమ్మల జ్ఞాపకార్థం ఈ అన్నదాన వేడుకలను నిర్వహించారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో దేశ విదేశాల నుండి దాతలు సహకారంతో ఒక పక్క సేవలను,మరొక పక్క పేద వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి,ట్రస్టు సెక్రటరీ చివుకుల రాంగోపాల్‌శాస్త్రి, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు,ట్రస్టు సభ్యులు వేమాకవిత,చలువాది చంద్రావతి, కొప్పోలుశ్రీనివాసరావు,శీలంమల్లారెడ్డి,వేమా నాగరాజు, ఎం.రామాంజనేయులు, ఆర్.జార్జి, గ్రామస్తులు దాచర్ల విశ్వనాథం, బొడ్డు శంకర్‌బాబు, పాదర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### 22న జిల్లా స్థాయి జూనియర్ బాల,బాలికల హాకీ జట్ల ఎంపికలు

**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా జూనియర్ బాల బాలికల హాకీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ రమణారెడ్డి, ఏ.సుందరరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ పట్ల ఆసక్తి గల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం తీసుకొని 22వ తేదీ ఉదయం 9 గంటలకు రావాలన్నారు. ఈ ఎంపికలకు వచ్చే వారు 01/01/2006 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ 9951578357 ను సంప్రదించాలని వారు కోరారు.

## బీసీల అభివృద్ధికి ఒకరికి ఒకరు సహకరించుకుందాం




**పొన్నలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
వెనుకబడిన వర్గాల ఆర్థిక, వ్యాపార అభివృద్ధికి ఒకరికొకరం సహకరించుకుని ఆర్థికంగా,సామాజికంగా పురోగతి సాధిద్దామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బుధవారం నాడు సీఎస్ఆర్ ఇన్ఫ్రా సువర్ణ గంధం ప్రాజెక్టు వెంచర్స్ చైర్మన్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో వెల్లటూరులో బీసీ వాణిజ్య ప్రతినిధుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ చిన్న వయసులోనే 80 ఎకరాల్లో ఫార్మా ల్యాండ్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి దారులకు మంచి లాభసాటిగా ఉండే విధంగా వెంచర్ ఏర్పాటు చేసిన సీహెచ్ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారు సోమరాజు, బీసీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### జిల్లా అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రికి దామచర్ల సత్య విజ్ఞప్తి



**పొన్నలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిసెట్టి అప్పలనాయుడుతో కలిసి రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య విజ్ఞప్తి చేశారు. భూమి వనరుల శాఖ 2021 ఆర్థిక సంవత్సరంలో 8 డబ్ల్యూడీసీ పీఎంకేఎస్‌ఓ 2.0 ప్రాజెక్టులను అనుమతించిందని, ఈ ప్రాజెక్టు అమలు గడువు 2025-26 ఆర్థిక సంవత్సరంతో ముగుస్తుందని, ఈ నేపథ్యంలో ప్రకాశం జిల్లాలో 1,50,000 హెక్టార్ల కన్నా ఎక్కువ భూమిని డబ్ల్యూడీసీ పీఎంకేఎస్‌వై 2.0 ప్రోగ్రాం కింద పునరుత్పత్తి చేయడానికి 41 వాటర్ షెడ్ ప్రాజెక్టులను ఆమోదించాలని కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌ను అభ్యర్థించినట్లు దామచర్ల సత్య తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమలు ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తి, గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక స్థితి మెరుగవుతుందని, మంత్రి చంద్రశేఖర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి ప్రకాశం జిల్లా అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని చెప్పినట్లు దామచర్ల సత్య తెలిపారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన పొన్నలూరు ఎస్సై



**పొన్నలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాలను బుధవారం నాడు పొన్నలూరు ఎస్సై కే.అనుక్ పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలు నేపధ్యంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్ష కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## జేబికె పురం వద్ద రైల్వే గేటు మూసివేత




**బేస్తవారిపేట, మార్చి 19 ప్రభాతవార్త**
మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం స్టేషన్ వద్ద ఉన్న రైల్వే గేటు ఈనెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో గేటు మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వాహనదారులు ఈ విషయాన్ని గుర్తించి గిద్దలూరు, కంభం తురిమెళ్ళ, రాచర్ల వైపు వెళ్ళే వాహనదారులు రైల్వే గేటు ప్రక్క నుంచి కృష్ణాపురం గ్రామం గుండా రాకపోకలు సాగించాలని అధికారులు సూచించారు.

### పొలిటికల్ పార్టీ ప్రతినిదులతో ప్రతినెలా మొదటి వారంలో సమావేశం



**గిద్దలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వెంకట శివరామిరెడ్డి, గిద్దలూరు తహశిల్దార్ ఆంజనేయ రెడ్డిల అధ్యక్షతన ప్రతినెలలో మొదటి వారంలో పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తహశిల్దార్ ఆంజనేయ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారి పొలిటికల్ పార్టీ ప్రతినిధుల నుండి వచ్చే వినతులు మరియు పోలింగ్ స్టేషన్‌ల స్థితిగతులు, ఏవైనా పడిపోయే స్థితిలో ఉండి మీ దృష్టికి వచ్చినట్లయితే వాటిని తమకు తెలియపరచాలని సూచించారు.

## ధాన్యం నిల్వలో జాగ్రత్తలు పాటించాలి

### - వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి



**గిద్దలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
మన దేశంలో పండించిన ఆహార ధాన్యలలో సుమారు 10 శాతం నిల్వలో సరైన జాగ్రత్తలు లేకపోవడం వలన నష్టపోతున్నాయని రైతులు నిల్వచేసిన ధాన్యంపట్ల తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. మండలంలోని నరవ గ్రామంలో బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు నిలువ చేసిన ధాన్యాన్ని ముఖ్యంగా క్రిమి కీటకాలు ఆశించి నష్టపరుస్తున్నాయని ఆహార ధాన్యాన్ని నిల్వ చేసినప్పుడు ముక్క పురుగు, తొట్టుపురుగు, పుచ్చు పురుగు మొదలైనవి ఆశించి నష్టపరుస్తాయని తెలిపారు. కావునా రైతులు ఆహార ధాన్యాన్ని నిలువ చేసేటప్పుడు నూర్చిన ధాన్యంలో 17-18శాతం తేమే ఉంటుందని అలాగే నిల్వ ఉంచితే ముక్కు వాసన వస్తుందన్నారు. రంగు మారి తర్వాత పురుగుపడుతుందని తెలిపారు.

**ధాన్యం నిలువలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**
అందువలన ధాన్యాన్ని 10-12శాతం తేమ ఉండే వరకు ఆరబెట్టి నిలబెట్టుకోవాలన్నారు. గోదాములలో గోడలకు, నేలమీద పగుళ్ళు, రంధ్రాలు ఉంటే సిమెంట్‌తో పూడ్చి వేయాలని సూచించారు. ధాన్యం నందు దుమ్ము, ధూళి లేకుండా చూడాలని, ధాన్యం నిలువ ఉపయోగించు గోనసంచులకు దూరంగా ఎత్తైన బల్లలపై నిల్వ చేయాలని తెలిపారు. వేప గింజల పొడిని ఉపయోగించి వరి, శనగలు, కందులు మొదలైన వాటిని కీటకాల బారి నుండి రక్షించుకోవచ్చని తెలిపారు. ఒక పాలు వేపగింజల పొడిని 100పాళ్ళ ధాన్యాన్ని కలపాలని వేపగింజలు కాకుండా మిరియాలు, పుదీనా ఆకు, కొత్తిమీర, ఆకుల పొడి, యూకలిప్టస్ ఆకులు పొడిని వాడొచ్చని, అల్యూమినియం పాస్పైట్ బిళ్లలు, గాలిలోని తేమను పీల్చుకొని అమ్మోనియం కార్బన్ డై ఆక్సైడ్ మరియు పాస్పిన్ వాయువులు విడుదల చేస్తాయని తెలిపారు. పాస్పిన్ వాయువు చాలా ప్రమాదకరమైనదని, ఒక టన్ను ధాన్యానికి ఒకటి, రెండు బిళ్ళలు సరిపోతాయని, ఈ విధంగా ధాన్యం నిలువలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయికళ్యాణి, భవాని మరియు రైతులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారులు



**రాచర్ల, మార్చి 19, ప్రభాతవార్త**
మండలంలోని రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) పరీక్షా కేంద్రాలనుఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఏ.వెంకటేశ్వర్లు పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసి పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. తనిఖీ సమయంలో విద్యార్థుల దగ్గర ఎలాంటి స్లిప్పులు దొరకకపోవడం, విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాస్తుండడం,పరీక్షల సందర్భంగా లోపలబయట ఎక్కడకూడా ఎలాంటి అలజడలు కనిపించకపోవడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలు బాగా జరుగుతున్నాయని, నిర్వహణ సంతృప్తికరంగా ఉందని అన్నారు. రాచర్ల జడ్‌పిహెచ్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన పరీక్షల నిర్వహణ చాలా చక్కగా ఉందని, విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని పరీక్షల చీఫ్ అధికారి షేక్ గౌస్ బాషను ఆయన అభినందించారు. ఇదే విధానాన్ని చివరి పరీక్ష వరకు కొనసాగించాలని తెలిపారు.

### ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తుంది - ఏవో



**పొన్నలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అయిన తైవాన్ స్ప్రేయర్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు పొన్నలూరు వ్యవసాయాధికారి పూర్ణచంద్రరరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కోటపాడు, కే.అగ్రహారం రైతుసేవా కేంద్రాలలో రైతులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలు అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఖచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతి ప్రభుత్వ పథకానికి అది అవసరం అని తెలిపారు. మండలంలోని ప్రతి రైతు సేవ కేంద్రం నందు సామాజిక తనిఖీ కొరకు ఈ పంట ముసాయిదా ప్రదర్శించామని, రైతులు జాబితా చూసుకొని అభ్యంతరాలు ఉంటే రైతు సేవ కేంద్రం నందు సంప్రదించి గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని పూర్ణచంద్రరరావు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఈ.సుధీర్ కుమార్, వ్యవసాయ సహాయకులు మధు, మస్తాన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలి



**హనుమంతునిపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
రెవెన్యూ సదస్సులో పేదలు ఇచ్చినటువంటి అర్జీలకు సంపూర్ణ పరిష్కార మార్గం చూయించి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 40 రోజుల్లో రెవెన్యూ సంస్థల్లో వచ్చినటువంటి అధ్యయనం పరిష్కారం చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూ సంబంధిత సమస్యలు ఇళ్ల స్థలాలు సాగు భూములు భూమి హద్దులు కొలతలు ఆక్రమణలు బినామి పట్టాలు, ప్రభుత్వ భూములు, ఆక్రమణ పట్టాలు, పేదల చేతులు భూమిలో మరొకరు ఇతరులు ఇలా అనేక రకాలైనటువంటి సమస్యలపై వందలాది అర్జీలు పేదలు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేదలకు ఇచ్చినటువంటి రిసిప్టులు పరిష్కార కాలమానాన్ని పొందుపరచకుండా రసీదులు ఇచ్చారని ఇలా ఇవ్వడం వల్ల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిర్ణిత కాలంలో సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా పరిష్కరించకుండానే ఆన్‌లైన్‌లో పరిష్కరించినట్లు మెసేజ్‌లు పంపిస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు దారుడు నుండి సమస్య పరిష్కారం అయినట్లు సంపూర్ణంగా తన అభిప్రాయాన్ని వ్యక్తపరిస్తే అది పరిష్కారమని కేవలం మాటల ద్వారా పరిష్కారాలు చూపడం సరికాదన్నారు. అధికారులు ఒత్తిళ్ల ప్రభుత్వంలో పెద్దల యొక్క ఆదేశాల మేరకు అరకొర పరిష్కారాలు చేసి పరిష్కరించామంటే కుదరదని హెచ్చరించారు. వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు బినామీ పేర్లతో భూ స్వాములు ఆక్రమిస్తుంటే రెవెన్యూ అధికారుల దగ్గర ఏ మాత్రం చలనం లేదన్నారు. భూ సమస్యలకు ప్రభుత్వం చొరువ చూపి పరిష్కరించకుంటే ప్రజా పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దంతల జాన్ ప్రేమ్ కుమార్ సామ్యూల్ సైమన్, మల్లెల మేరి, గోన ఎలిసమ్మ, కత్తి సునీత, దంతెల సంధ్య,మల్లెల సంతమ్మ, మల్లెల నవజీవన, ఎలీషా, యోహాను, ఏసేపుతో పాటు గ్రామంలో మహిళలు, దళితులు హాజరయ్యారు.

## శేషవాహనంపై ఊరేగిన శ్రీవారు





**కొనకనమిట్ల, మార్చి 19, ప్రభాతవార్త**
మండలంలోని గార్లదిన్నె పంచయతీ వెలుగొండ క్షేత్రంలో అలివేలు మంగా సమేత లక్ష్మీ శ్రీ వెంకటేశ్వరస్వామి (శ్రీవారు) బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు శేష వాహనంపై వెలుగొండ మాడ వీధుల్లో ఊరేగారు. అర్చకులు నంద్యాల ప్రసాదాచార్యులు, కొడవటిగంటి వెంకటరమణాచార్యులు, భార్గవరమణ చార్యులు ఆధ్వర్యంలో తొలుత మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డిల పర్యవేక్షణలో మధ్యాహ్నం నగరోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో ఉభయ దాతలు మంగళకుంటకు చెందిన మారెళ్ళ నాగ వెంకట దిలీప్ కుమార్ దంపతులు, మారెళ్ళ నాగేశ్వరరావు, తిరుపతిరావులు పాల్గొని తొలుత హోమాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మణ అన్న సత్ర అభివృద్ధికి సహకరించిన అయినంపూడి చంద్రశేఖర్, పడకండ్ల చెన్నయ్య, భార్య భాగ్యలక్ష్మీ, రామాంజనేయులను సన్మానించారు.

### పదో తరగతి పరీక్షల పట్ల పోలీసు శాఖ పటిష్ట భద్రత





**మార్కాపురం, మార్చి 19, ప్రభాతవార్త**
పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు శాఖ పటిష్ట భద్రత తీసుకొని విద్యార్థులకు చేస్తున్న సేవల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఐ పి.సుబ్బారావు పరీక్ష కేంద్రాలను సందర్శించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకొని కేంద్రాల నిర్వాహకులకు పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇదే సమయంలో బుధవారం పదో తరగతి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థినీ పొరపాటున ఒక పరీక్ష కేంద్రానికి బదులు మరో పరీక్ష కేంద్రానికి వచ్చి సమయం లేకపోవడంతో ఆందోళనకు గురి అవుతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై అహారూన్ ఆ విద్యార్థినికి సహకరించి తన మోటారు బైక్‌పై నిర్దేశించిన పరీక్ష కేంద్రానికి చేర్చి పోలీసు సేవలను చాటారు. ట్రాఫిక్ ఎస్సై చేసిన సహాయానికి విద్యార్థినీలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు పోలీసు సేవలపై ప్రశంసలు హర్షం కురిపించారు.

## కాలేజీ బస్సు దగ్ధం



**పొన్నలూరు, మార్చి 19, ప్రభాతవార్త**
కందుకూరు గాయత్రి కాలేజీకి సంబంధించిన బస్సు చెరువు కొమ్ముపాలెం హైస్కూల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు పొన్నలూరు, విప్పగుంట పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ముగిసిన తర్వాత చెరువుకొమ్ముపాలెంలో విద్యార్థులను డ్రాప్ చేసిన తర్వాత డ్రైవర్ బస్సును చెరువు కొమ్ముపాలెంలో పార్కు చేయగా షార్ట్ సర్క్యూట్ వల్ల అకస్మాత్తుగా మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. కాలేజీ యాజమాన్యం పోలీసు స్టేషన్‌లో రిపోర్టు చేసినట్లు పొన్నలూరు ఎస్సై అనుక్ తెలిపారు.

## శోకసంద్రంలో గుడిపాడు గ్రామం



**బల్లికురవ, మార్చి 19, ప్రభాతవార్త**
మండలంలోని ఎస్‌ఎల్‌గుడిపాడు గ్రామంలో విషాధ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన బండ్ల కనకయ్య, నాగేశ్వరమ్మలకుమారుడు బండ్లహనుమంతరావు(28) మంగళవారం రాత్రి నరసరావుపేటలోని ఒక లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కనకయ్య నాగేశ్వరమ్మలకు హనుమంతరావుతో పాటు మరో ఆడ పిల్ల కూడా ఉంది. ఆమెకు వివాహం అయింది. హనుమంతరావుకు గత ఆగష్టులో పలనాడు జిల్లా పమిడిమర్రు గ్రామానికి చెందిన సౌజన్యతో వివాహమైంది. అప్పటి వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా హనుమంతరావు కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలిచాడు. కారణం ఏమైనా ఉద్యోగాన్ని కోల్పోవడం, ఆ తర్వాత నరసరావుపేటలో ఉంటూ వస్తున్నాడు. హనుమంతరావు భార్య సౌజన్య పమిడిమర్రులో ఉంది. హనుమంతరావు వివాహం చేసుకొని ఒక ఇంటి వాడు అయ్యాడు అన్న ఆనందం, కుటుంబానికి మరింతగా ఆర్థిక అభివృద్ధిలోకి తీసుకొస్తాడు అన్న నమ్మకంతో ఆ వృద్ధ దంపతులు జీవిస్తున్నారు. కారణం ఏదైనా చేతికి అంది వచ్చిన కొడుకుఅకాల మరణంతో ఆ వృద్ధ దంపతులు తల్లిడిల్లి పోతున్నారు. భర్త మరణం తట్టుకోలేని సౌజన్య కూడా ఆత్మహత్యకుయత్నించటం మరింత బాధాకరం.సౌజన్యనరసరావుపేట వైద్యశాలలో కోలుకుంటున్నారు .హనుమంతరావు మృతదేహానికి బుధవారం సాయంత్రం గుడిపాడులో అంత్యక్రియలు నిర్వహించారు.

## మట్టినమూనా పరీక్షలు చేయించుకోవాలి



**పెద్దదోర్నాల, మార్చి 19, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం చింతల, మర్రిపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగులో ఉన్న మామిడి పంటను సందర్శించి రైతులకు సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా వేసవిలో పంట పొలాలు అయిపోయిన రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరణ చేసి మట్టి పరీక్షలు ఉచితంగా చేపించి మట్టి పరీక్ష కార్డు లను కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్డుల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టినట్లయితే పెట్టుబడి తగ్గించుకోవచ్చున్నారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న వ్యవసాయ యాంత్రీకరణ, పీఎంకిసాన్, ఈ పంట నమోదు, ఏపీఎఫ్ఆర్, సీఎస్‌ఎల్‌ఏపీపీ, ఏపీఎస్ఎస్ యాప్‌ల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



**తాళ్లూరు, మార్చి 19, ప్రభాతవార్త**
మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఒంగోలు డివిజన్ పంచాయతీ రాజ్ ఈఈ వై.కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేయటం జరిగిందన్నారు. మండలంలో 58 పనులకు 3 కోట్లు మంజూరు కాగా 53 పనులు పూర్తయ్యాయన్నారు. కొర్రపాటివారిపాలెంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సహకారంతో రూ.30లక్షలతో 2 పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు లేకుండా పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈఎం వెంకటేశ్వర్లు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### పునరావాస కాలనీలకు స్మశాన వాటిక స్థలం పరిశీలన



**మద్దిపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
గుండ్లకమ్మ జలాశయం నిర్మాణం చేపట్టి రెండు దశాబ్దద కాలాలు పూర్తయిన కూడా ఆయా పునరావాస కాలనీలో మౌలిక వసతులు కల్పన ఇంకా జరగలేదని అనేక పర్యాయాలు జిల్లా, మండల స్థాయి అధికారులకు ఆయా కాలనీ వాసులు వినతిపత్రం రూపంలో తెలియపరిచిన కూడా అధికారులు స్పందించని పరిస్థితి. ప్రభుత్వాలు మారిన కూడా ఆయా కాలనీలోనే మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. మండల పరిధిలోని గుండ్లకమ్మ జలాశయం ముప్పు పునరావాస గ్రామాలైన చిన్న మల్లవరం, గార్లపాడు, ఘడియపూడి, బూరేపల్లి తదితర గ్రామాల్లో స్మశాన వాటికలు లేక గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ జ్యోతి కుమారి బుధవారం నాడు మండల పరిధిలోని ఘడియపూడి కాలనీలకి స్మశాన వాటిక ఏర్పాటు విషయమై మద్దిపాడు గుండ్లకమ్మ జలాశయ కుడి కాలువ వైపు, గార్లపాడు కాలనీ వాసులుకు ఎఫ్‌సీఐ గోడెన్స్ దగ్గరలో స్థలాలను పరిశీలించారు. వీరి వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

# కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు



దొనకొండ,మార్చి 19,ప్రభాతవార్త

రైతు సోదరులు తాము పండించిన కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర 7550/లకు అమ్ముకున్నట్టితే మంచి ధరతో పాటు డబ్బులు కూడా వెంటనే బ్యాంకు ఖాతా కు జమ అవుతాయని మండల వ్యవసాయ అధికారి యన్. లక్ష్మీ నారాయణ తెలిపారు. దళారులకి అమ్మి మోసపోవద్దని కోరారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పడమర కంబం పాడు వారి ద్వారా ఆరవెల్లిపాడు గ్రామంలో ప్రభుత్వం తరుపున కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఏ ఓ తెలిపారు.ఈ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా అరవెల్లిపాడు రైతుసేవా కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కందులు అమ్ముకోవాడానికి గతంలో పంట నమోదు చేసుకున్న రైతులు ఆధార్ కార్డు తీస్కొని వెళ్లి వ్యవసాయ సహాయకులని సంప్రదించాలని కోరారు.ఈ ఖరీఫ్ సీజన్లో 2391 మంది రైతులు 5515 ఎకరాల్లో కంది పంటని సాగు చేశారని తెలిపారు.ఈ సంవత్సరం కురిసిన వర్షాల వలన కంది దిగుబడి ఎకరాకి 3 నుండి 5 క్వింటాల్ల వరకు రావొచ్చని తెలిపారు. తెల్లపాడు పంచాయతీ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతూ పేర్లు నమోదు చేసుకోక పోతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వీలు కాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు,గ్రామ వ్యవసాయ సహాయకులు ధన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఆధార్ క్యాంపులు

దొనకొండ,మార్చి 19,ప్రభాతవార్త

మార్చి 19,22,25, 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలు/ అంగన్వాడీ / స్కూళ్ళలో స్పెషల్ ఆధార్ క్యాంపులు మీకు ఏ ఆధార్ సమస్యలు ఉన్న ఈ క్యాంపులో క్లియర్ చేసుకోండి.క్యాంపు షెడ్యూల్, ఉండే సేవలు, అప్లికేషన్ ఫీజులు, అవసరం అయ్యే ఫారంలు, సపోర్టింగ్ డాకుమెంట్స్ లిస్ట్

## ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానం

దొనకొండ,మార్చి 19,ప్రభాతవార్త

ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్.. ఆధార్తో ఓటర్ కార్డు అనుసంధాన ప్రక్రియను ప్రారంభించిన ఎన్నికల కమిషన్

## దివ్యాంగురాలకు మూడు చక్రాల సైకిళ్లు, కుట్టు మిషన్లు పంపిణీ

**- శివ ఫౌండేషన్‌టీం పమిడి ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం**



ఒంగోలుకల్చరల్,మార్చి19,ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పమిడి రవితేజ పుట్టినరోజు వేడుకను శివం శరణాలయంలో అనాథలకు సేవ చేస్తూ వైభవంగా నిర్వహించారు... టీం పమిడి శివం పౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పమిడి రమేష్ తనయుడు యువ నాయకులు రవితేజ పుట్టిన రోజున ఒంగోలు సంతపేట షిరిడి సాయిబాబా మందిరం దగ్గర శివా శరణాలయంలో కేకు కటింగ్ చేసి అనాథలకు స్వీట్స్ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిద్దలూరుకి చెందిన దివ్యాంగుడు రాజా రామ్‌కు మూడు చక్రాల సైకిల్,ఒంగోలు గోపాల్‌నగర్‌కు చెందిన బాపట్ల రేఖ అనే దివ్యాంగురాలికి కుట్టు మిషన్ అందజేశారు. శివం నిత్యాన్నదాన సంచార వాహనం ద్వారా పట్టణంలోని అనాథలు యాచకులకు 300 మందికి మధ్యాహ్నం పూట పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి, టీం పమిడి సభ్యులు గోగినేని రాకేష్, శేఖర్ నారాయణరావు, హరీష్,నవీన్, సాద్విక్, ప్రసాద్, నాగరాజు,తిరుమల తదితరులు పాల్గొన్నారు

## మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వేలంపాట ద్వారా రూ.10.72 లక్షలు



మద్దిపాడు, మార్చి 19, ప్రభాతవార్త

మండల పరిధిలోని మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో బుధవారం నిర్వహించిన టెండర్‌కం బహిరంగ వేలంపాట ద్వారా రూ.10.72 లక్షల రూపాయలు ఆదాయం సమ కూరినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వర రావు తెలిపారు. బహిరంగ వేలం పాటలో చినమల్లవరం గ్రామానికి చెందిన ఏకాంబరం సుబ్బాయమ్మ కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుకుగాను రూ.1,46,000లతో,టీ,టిఫిన్ కూల్ డ్రింక్స్ తినుబండారాలు అమ్ముకునేందుకు రూ.1,74,000లకు, కొబ్బరిచెప్పులు పోగు చేసుకునేందుకు రూ.45వేల రూపాయలకు బహిరంగ వేలంపాట పాడి నగదును చెల్లించారు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన వాడపల్లి మీరావలి పెండ్లి మండపం ఏర్పాటుకు రూ.3,80,000లతో పాట పడి నగదు చెల్లించారు. అద్దంకిగ్రామానికి చెందినతాళ్లూరి శివరామకృష్ణ జనరేటప్‌పై లైటింగ్ వేలంపాటను రూ.2,66,000లకు పాటను దక్కించుకొని నగదు చెల్లించారు. ఒంగోలుకు చెందిన గంటా నాగమణి గుడి ఆవరణంలో ఐస్ క్రీమ్ అమ్మకాలకు రూ.22వేలకు, బొమ్మల అంగడీకి రూ.29వేలకు పాట పాడి నగదు చెల్లించారు. చిన్న మల్లవరం గ్రామానికి చెందిన లంకా సుబ్బారావు సోడాను అమ్ముకునేందుకు రూ.10వేలు పాటదక్కించుకున్నారు. పాట ముగింపు నాటికి 10 లక్షల 72 వేల రూపాయలు రాగా గత సంవత్సరం 9,34,500 మాత్రమే పాట ద్వారా నిధులు సమకూర్నట్లు గత సంవత్సరం కన్నా కూడా ఈ సంవత్సరం రూ.1,37,500 అదనంగా పాట ద్వారా నిధులు సమకూర్చాలని ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ దామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటకు 50 మంది రాగా 15 మంది ధరావత్తు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు, అటెండర్ గాజుల సాంబశివరావు, దేవస్థాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, నారాయణం రాజశేఖరచార్యులు, గ్రామపెద్దలుమార్నేని సుబ్బారావు,గాజుల రామకోటేశ్వరరావు,చిన్నవెంకటేశ్వర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పొగాకు కంపెనీల ప్రతినిధులు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

**- పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్**



మద్దిపాడు, మార్చి 19, ప్రభాతవార్త

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రారంభం సందర్భంగా ఆయన ముఖ్య అతిధిగా హాజరై కంపెనీల ప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోయిన నేపథ్యంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కంపెనీల ప్రతినిదులను కోరారు. మార్కెట్ స్థిరంగా ఉండే విధంగా కొనుగోళ్లు చేయాలని ఆయన తెలిపారు. రైతులు నాణ్యమైన పొగాకును వేలం కేంద్రాలకు తీసుకువచ్చి మంచి ధరను పొందాలన్నారు. పొగాకులో అన్య పదార్థాలు కలవకుండా బేళ్ల కట్టుకుని వేలం కేంద్రానికి తీసుకురావాలన్నారు. పొగాకు బోర్డు రైతుల సంక్షేమం కోసం అండగా నిలుస్తుందన్నారు. ఉదయం ఆయన వేలం కేంద్రంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన పొగాకు వేలం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనవాయితీగా చంద్రపాడు గ్రామ రైతులకు చెందిన 18 పొగాకు బేళ్లను వేలంకు తీసుకురాగా, కంపెనీలవారు అన్ని బేళ్లను280 రూపాయల వంతున కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం బోర్డు వారు 10 మిలియన్ కేజీల పొగాకు అనుమతించగా సుమారు 15.75 మిలియన్ కేజీల పొగాకు రైతులు పండించినట్లు అంచనా. కర్నాటకలో వేలం ప్రక్రియ పూర్తికాని నేపథ్యంలో పూర్తి స్థాయిలో కంపెనీలు వేలంకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కంపెనీలు పూర్తిగా పాల్గొనే వరకు క్లస్టర్ల వారీగా వేలం నిర్వహిస్తామని అనంతరం వచ్చే నెల 8,10వ తేదీల నుండి వేలంను వేగవంతం చేయనున్నట్లు వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, బోర్డు సభ్యులు పొద వరప్రసాద్, రైతు సంఘం అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, వరహాల చౌదరి, ఉమామహేశ్వరరావు, శ్రీరామమూర్తి, సుధాకర్, గంగిరెడ్డి, హరిబాబు, సత్యనారాయణరెడ్డి, గోవిందరాజులు, వెంయ్య, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, జీపీఐ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పలువురు రైతు నాయకులు పొగాకు రైతులు పాల్గొన్నారు.

# 23న మార్టూరులో శ్రీనివాస కళ్యాణం

మార్టూరు, మార్చి 19, ప్రభాతవార్త

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం మార్చి 23న ఆదివారం ఉదయం 9గంటలకు మార్టూరులోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరగనున్నది. తిరుమల దేవాలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితులు ఆధ్వర్యంలో జరగనున్న ఈ కళ్యాణ మహోత్సవానికి మార్టూరు, పరిసర గ్రామాల భక్త మహాశయులు భారీగా పాల్గొని బ్రహ్మాండ నాయకుని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదములు, అన్నదానం స్వీకరించాలని నిర్వాహకులు తెలిపారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతులు సాంప్రదాయ వస్త్రములు ధరించి రావాలన్నారు.

# గ్రీన్ ఫీల్డ్, నౌకాశ్రయం ఏర్పాటు చేయండి

**- కేంద్ర మంత్రికి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వినతి**

**- అభివృద్ధికి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి**

**- గ్రీన్‌ఫీల్డ్ ఏర్పాటుకు ముందడుగు : ఎమ్మెల్యే ఏలూరి**



మార్టూరు, మార్చి 19, ప్రభాతవార్త

చిన్నగంజాం మండలంలోని మోటుపల్లి–పెద్దగంజాం గ్రామాల మధ్య తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్‌పోర్ట్స్,నౌకాతయారీ కేంద్రం స్థాపించాలని, కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాలశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ కు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నౌకాశ్రయం ఏర్పాటుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇప్పటికే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు లేఖలు రాశారు. చిన్నగంజాం తీర ప్రాంతం పోర్టు నిర్మాణానికి అనువుగా ఉంటుందని, అన్ని సదుపాయాలు ఉన్నాయని అన్నారు. ఇటీవల మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కేంద్ర మంత్రిని స్వయంగా కలిసి ఏలూరి రాసిన లేఖను సైతం అందజేశారు. తాజాగా రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా విజ్ఞాన్ భవన్ లో జరిగిన 4వ జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ(ఎన్ఎస్ఏసీ) సమావేశంలో కేంద్ర మంత్రికి గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌకా తయారీ కేంద్రం స్థాపించాలని కోరుతూ లేఖను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాం మండలంలోని మోటుపల్లి–పెద్దగంజాం గ్రామాల మధ్య తీర ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌకా తయారీ కేంద్రం స్థాపించాలని కోరారు. ఈ పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకత అనుకూలత ఉందన్నారు.ఈ పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు, స్థానికంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నౌకాశ్రయం, తయారీ భారీ యూనిట్ ఏర్పాటుకు ముందడుగు పడటం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే దీని ఆశ్యకత పై కేంద్ర మంత్రికి ఇప్పటికే లేఖ రాశామని పేర్కొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశ్రమతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయన్నారు. నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పర్చూరు నియోజకవర్గ దిక్సూచిగా మారుతుందన్నారు. వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి ఉద్యోగ అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.రవాణా వ్యవస్థ మెరుగు పడటంతో పాటు పలు పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

# దొంగమస్టర్లపై ఏపీవోను నిలదీసిన గ్రామస్తులు



బల్లికురవ, మార్చి 19, ప్రభాతవార్త

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కొనసాగుతున్న అక్రమాలకు అడ్డే లేకుండా పోతుంది. దీంతో విసుకు చెందిన మండలంలోని రామాంజనేయపురం గ్రామస్తులు బుధవారం ఏపీవోను నిలదీశారు. క్షేత్ర సహాయకుడు పోతురాజు స్థానంలో బినామితో పనులు చేయిస్తూ దొంగ మస్టర్లు వేస్తూ అక్రమంగా సొమ్ము స్వాహా చేస్తున్నారని దీనికి సమాధానం చెప్పాలంటూ ఏపీవోను నిలదీశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదేతంతు కొనసాగుతుంది. ఉద్యోగులు, పనులకు రానివాళ్లు, ఇతర పనులు చేసుకునే వాళ్ల పేరిట మస్టర్లు వేస్తూ ఉపాధి మామీ సొమ్మును, వాటాలు వేసుకుని మరి దిగమింగుతున్నారు. ఇటీవల మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహించి మమ అనిపించేశారు. క్షేత్ర స్థాయి నుండి సిబ్బంది సమిష్టి సహకారంతో అవినీతి సొమ్మును మహా దర్జాగా పంచుకోవడం ఆనవాయితీగా మారడంతో ఉపాధి పనులలో అవినీతి అనకొండలాగా పెరిగిపోతూనే ఉంది. శాఖా పరంగా సిబ్బంది ప్రక్షాళన జరిగే వరకు ఈ దొంగ మస్టర్ల విధానం కొనసాగుతూనే ఉంటుంది.

# వైసిపి పాలనలో గిరిజనులకు అన్యాయం

**- తెలుగుదేశంపార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు**



యర్రగొండపాలెం రూరల్, మార్చి 19 ప్రభాతవార్త

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పివిటిజి శ్రీశైలం వారి ఆధ్వర్యంలో బుధవారం యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు చెంచు, గిరిజనులకు 300కు పైగా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయడం జరిగింది. యర్రగొండపాలెం పట్టణంలోని మండల కార్యాలయం ఆవరణంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన పౌష్టికాహార కిట్లుపంపిణీ కార్యక్రమానికి తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిధిగా పాల్గొని గిరిజనాభివృద్ధి సంస్థ పిఓ శశికుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసిందని, ఒక్క పైసా కూడా ఐటిడిఏల ద్వారా గిరిజనులకు ఖర్చు చేయలేదని, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ధ్వజమెత్తారు. తెలుగుదేశం ప్రభుత్వంలో గిరిజనులకు విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలతోపాటు కూడు, గూడు,గుడ్డ ప్రభుత్వం కల్పిస్తుందని దాంతోపాటు ఆర్థికాభివృద్దికి సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికలలో నియోజకవర్గంలోని గిరిజన చెంచు గూడెంలను తిరిగానని, వారిని దగ్గర నుంచి చూశానని గిరిజనులు నిత్యం కష్టజీవులని రేయింబవళ్ళు కష్టపడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుండటాన్ని గమనించానని దీని వలన కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

**గిరిజన జీవన ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా సంపూర్ణ సహకారం :**

సమగ్ర గిరిజనాభివృద్ధి పిఓ వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ సంస్థ ద్వారా గిరిజన జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా సంపూర్ణ సహకారం అందజేస్తానని తెలిపారు. సభలో గిరిజన మహిళలు కొందరు గూడెంలలో ఫారెస్టు అధికారులు బోర్లు వేయనీయడం లేదని పిఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఎరిక్షన్ బాబు కల్పించుకుని ఈ సమస్య పలుమార్లు నా దృష్టికి వచ్చిందని ఈ సమస్యను మంత్రి గొట్టిపాటి ద్వారా పరిష్కరానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సురేష్ కుమార్, తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, జిల్లా నాయకులు వేగినాటి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ నాయకులు ముత్తులూరి మల్లిఖార్జున చారి, జనసేనా నాయకులు శివలతోపాటు గిరిజన నాయకులు, గిరిజన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 29న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, మార్చి 19, ప్రభాతవార్త

ఈనెల 29వ తేదీన ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ కుసుమకుమారి తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. వేసవి నేపథ్యంలో మండలంలో నెలకొన్న సమస్యల గురించి ప్రధానంగా చర్చించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అందరూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

# సస్పెండ్ చేసే అధికారం లేదు



సింగరాయకొండ, మార్చి 19,ప్రభాతవార్త

జనసేనపార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న మండల ఉపాధ్యక్షులు సయ్యద్ ఖాజా హుస్సేన్‌లను పార్టీ నుండి సస్పెండ్ చేసే అధికారం మండల అధ్యక్షుడు అయినాబత్తిన రాజేష్‌కు లేదని జనసేన సీనియర్ నాయకులు అడుసుమల్లి సుధాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని నియోజక వర్గస్థాయి జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జనసేన పార్టీ నుండి మండల ఉపాధ్యక్షులు ను సస్పెండ్ చేస్తూ ప్రకటన విడుదల చేయటాన్ని సవాల్ చేస్తూ పార్టీ నుండి ఎవరిని సస్పెండ్ చేయటానికి రాజేష్ కి హక్కులేదని, ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే పార్టీ క్రమశిక్షణ సంఘంకు మాత్రమే హక్కు ఉంటుందని అన్నారు.పార్టీ లో పట్టుమని పదిమందిలేని నువ్వా పార్టీనుండి నాయకులను సస్పెండ్ చేసేదని,పార్టీకి కష్టపడి పనిచేసే వారిపై బెదిరింపులకి పాల్పడితే సింగరాయకొండ జనసేనపార్టీ కార్యకర్తలు, నాయకులు చూస్తూ ఊరుకోబోమని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వారి పై తగు చర్యలు చెప్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ద. చాంబాషా, ఖాజాహుస్సేన్, మనోజ్, ఉజ్వల్, వేణు, అజయ్, శీలం బాలకోటయ్య, రాజా, శశి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం





బల్లికురవ, మార్చి 19, ప్రభాతవార్త

మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో వేంచేసి యున్న రామలింగేశ్వర స్వామి తిరునాళ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.గ్రామ సమీపంలోని కొండబోడులో వేంచేసియున్న స్వామి వారికి ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు కోటవారిపాలెం గ్రామాలకు చెందిన భక్తులు ఉదయంనుంచి మొక్కుబడులు చెల్లించు కున్నారు. గ్రామస్తుల సమిష్టి సహకారంతో అన్నదాన కార్యక్రమం, బృందావన భజన, ఒక విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది. ఎస్సై జీవీ చౌదరి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భద్రతా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# వైభవంగా లక్ష్మీనృసింహుని తిరునాళ్ల మహోత్సవం

**- శ్రీ బాల ప్రసన్నాంజనేయునికి విశేష పూజలు**

**- స్వామివారికి బోనాలు సమర్పించిన మహిళా భక్తులు**

**- పులిహోర, తాగునీరు అందించిన దాతలు - పోలీసుల పటిష్ట బందోబస్తు**





సంతమాగులూరు, మార్చి 19, ప్రభాతవార్త

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని క్షేత్రంపై స్వయంభువుగా వేంచేసిఉన్న రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి 57వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవోపేతంగా సాగింది. కొండ దిగువున కొలువుదీరిన శ్రీ బాల ప్రసన్నాంజనేయునికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వినుకొండ శ్రీనివాసమూర్తి, సత్యవరప్రసాద్, సత్యబాబు, నరసింహమూర్తి, శరత్‌బాబు ఆధ్వర్యంలో నృసింహునికి, అంజనీసుతునికి చక్రస్నానాలు చేసి, పూజా కైంకర్యాలు, అభిషేకాలు జరిపారు. పట్టు వస్త్రాలు, పూలతో విశేషంగా అలంకరించారు. మహిళలు పాల పొంగళ్ల వండి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించారు. నూతన దంపతులు, గ్రామస్తులు స్వామివారి మెట్ల మార్గాన్ని పసుపు కుంకుమతో పూజించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రంపైకి వెళ్లి గుహలో ఉన్న నృసింహుడిని, రాజ్యలక్ష్మీ అమ్మవారులను దర్శించుకున్నారు. రాత్రికి ఆలయాలను విద్యుదీకరణతో సుందరంగా తీర్చిదిద్దడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



**మొక్కుబడి ప్రభల కోలాహలం :**

లక్ష్మీ నృసింహుని తిరునాళ్లను పురస్కరించుకుని మొక్కుబడి ప్రభలను ఏర్పాటు చేశారు. మేళ తాళాలు, డీజే సౌండ్ మధ్య తడిక ప్రభలను ఊరేగింపుగా కొండకు తరలించారు. యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. చిన్న పిల్లలు, ఆట వస్తువులు, బొమ్మలు కొలువులు, రంగులరాట్నం వద్ద సందడి చేశారు.

**పులిహోర, తాగునీరు పంపిణీ :**

దాతల దాతృత్వంతో నృసింహస్వామి తిరునాళ్లలో ప్రత్యేక షామియాన ఏర్పాటు చేసి ఉచిత మంచినీరు, పులిహోర పంపిణీ చేశారు. స్వామివారిదర్శనం కోసం వచ్చిన భక్తులు, గ్రామస్తులు అందరూ తాగునీటిని సద్వినియోగం చేసుకున్నారు.

**పోలీసులు పటిష్ట బందోబస్తు :**

సంతమాగులూరు పోలీసు స్టేషన్ ఎస్సై పట్టాభిరామయ్య ఆదేశాలు మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు ఏల్చూరులో పటిష్ట బందోబస్తు చేపట్టారు. దేవాలయం ప్రాంగణం, అంగళ్ల సమీపంలో పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు స్వామివారిని దర్శించుకునేలా పటిష్ట చర్యలు చేపట్టారు.

## రామసముద్రం, మిట్టపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



త్రిపురాంతకం, మార్చి 19 ,ప్రభాతవార్త

మండలంలోని రామసముద్రం మరియు మిట్టపాలెం గ్రామాలలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ ధనీశ్వర్ నాయక్ మరియు విఏఏ జి.అచ్యుతరావులు పాల్గొని పంటల యొక్క యాజమాన్యం గురించి, పంటలో వచ్చే చీడపీడల యొక్క నివారణ గురించి వివరించారు. అదేవిధంగా పంటల యందు రసాయనాల వాడకాన్ని తగ్గించాలని రైతు సోదరును కోరడం జరిగింది. రైతులు మిరప పంట చుట్టూ రెండు వరుసలలో జొన్న పైరు వేయడం ద్వారా కొంతవరకు రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇలాంటి యాజమాన్య పద్ధతులు పాటించడం వలన రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. పొలం ఉన్న ప్రతి రైతు వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రాలకు వెళ్ళి విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి అచ్యుతరావు, ఆర్ వెంకటేశ్వర్లు నాయక్, గ్రామ రైతులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## 10 తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్



యర్రగొండపాలెం రూరల్, మార్చి 19, ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షలలో భాగంగా సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్ యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థుల హాజరుపై ప్రధానోపాధ్యాయులును అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు లోకల్ వాట్సాప్ గ్రూపులలో వస్తున్న పోస్టులపై ఆరాతీశారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలని, విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, పరీక్షా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కళాశాలహెడ్‌మాస్టర్‌ను ఆదేశించారు.పరీక్షలు పకడ్బంధీగా, సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ నలగాటి మల్లిఖార్జున నాయుడు, అధికారులు ఉన్నారు.

# కందులు క్వింటా మద్దతు ధర రూ.7550 లు

**- ఏవో అబ్దుల్ రఫిక్**



రాచర్ల, మార్చి 19, ప్రభాతవార్త

కందులు క్వింటాల్ మద్దతు ధర రూ.7550లుగా ప్రభుత్వం నిర్ణయించిందని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫిక్ అన్నారు. మండలంలోని ఎడవల్లి, రాచర్ల గ్రామాల్లో బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏపి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కందులు కొనుగోలు చేస్తుందని అందులో భాగంగా ఈ ధర నిర్ణయించిందన్నారు. కంది పంట వేసిన రైతులు తమ కందులు గిట్టుబాటు ధరకు విక్రయించుకోవాలంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా పరిశీలన కొరకు ఒక కిలో కందులు సమీప రైతు సేవా కేంద్రాల్లో శాంపిల్స్ కొరకు వ్యవసాయ శాఖ సిబ్బందికి ఇవ్వాఆలని ఆయన రైతులకు తెలిపారు. శాంపిల్స్ పరిశీలన అనంతరం కందుల కొనుగోలు ఎప్పుడు చేసేది రైతులకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదే విధంగా పంటల సాగు విషయంలో అధికారుల మెలకువలను పాటించాలని తెలిపారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు కూడా రైతులకు అందజేయడం జరుగుతుందని అర్హత కలిగిన రైతులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు ఐ రమేష్, ఐ లలిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకయ్య ఆశ్రమంలో వస్త్రాలు పంపిణీ



మార్టూరు, మార్చి 19, ప్రభాతవార్త

మార్టూరు కోరిగుంట్ల గవర్నమెంట్ హాస్పిటల్ పక్క రోడ్డులోని వెంకయ్య ఆశ్రమంలో మల్లాయపాలెం గ్రామ వాస్తవ్యులు దొండేటి శివ కీర్తన దొండేటి నిత్య, కుటుంబ సభ్యులు ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివ రాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## రైతన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యం - ఏవో కే.రాధ

**పామూరు, మార్చి 19, ప్రభాతవార్త**



రైతాంగం సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి వ్యవసాయాధికారుల సూచనలు,సలహాలను సకాలంలో పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి రాధ తెలిపారు. మండలంలోని చింతలపాలెం, బలిజపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు పలు సూచనలు అందజేశారు. రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, అదేవిధంగా యాంత్రీకరణపై దృష్టి సారించాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్‌ల ద్వారా ఎప్పటికప్పుడు పొలాల్లో ఆశించే తెగుళ్లను గుర్తించి ఉన్నతాధికారుల సూచనల మేరకు మందులను వాడుకోవాలన్నారు. పంటనష్టం పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ తిరుమలరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చురుగ్గా నిర్మాణం జరుగుతున్న హాస్టల్ పనులు

**పామూరు, మార్చి 19, ప్రభాతవార్త**



శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషి ఫలితంగా ఎన్నో ఏళ్ల నుంచి కలగానే మిగిలిపోయిన ప్రభుత్వ బాలికల వసతి గృహానికి త్వరలోనే మోక్షం లభించనుంది. గత నెల 17వ తేదీన రూ.1.94కోట్ల ప్రత్యేక నిధులతో శంకుస్థాపన గావించిన గృహ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 6,7,8,9,10వ తరగతులతో పాటు జూనియర్ కళాశాలలో చదువుకునే ఇంటర్ విద్యార్థులకు సైతం ఈ వసతి గృహాల్లో అవకాశం లభించనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసించే విద్యార్థినులకు ఈ హాస్టల్ ఎంతో ఉపయోగకరం కానుంది. సరైన వసతి, భోజన సదుపాయాలు లేక మట్టిలో మానిక్యాలు లాంటి నిరుపేద విద్యార్థులు అర్థాంతరంగా చదువును ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉగ్ర నరసింహారెడ్డి చేపడుతున్న చర్యల వైద్యశాలలు, ప్రభుత్వ పాఠశాలలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. అందుకు తోడు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాబట్టి మోడల్ స్కూల్స్, ప్రభుత్వ వైద్యశాలలు ఆధునీకరణ గావించి ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

## పామూరులో విస్తరిస్తున్న వడ్డీ మాఫియా

### - విలవిల్లాడుతున్న నిరుపేదలు

**పామూరు, మార్చి 19, ప్రభాతవార్త**

పామూరు మండలంలో వడ్డీ మాఫియా కోరలు చాస్తుంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీలు రోజు వారి కూలి చేసుకుని జీవనం సాగించే వారిని టార్గెట్ చేసుకుని వెనుకబడిన వారితో పాటు, తోపుడు బండ్లు, రిక్షా బండులు నడుపుకునే వారికి రూ.10వేలు ముట్టచెప్తు వారానికి రూ.500లు చొప్పున 22 వారాలు రూ.12500 లు వసూళ్లు చేస్తున్నారు. మొదటి సారి ఇచ్చేటప్పుడు కొంత అమౌంట్‌ను అగ్రిమెంట్ కింద జమ చేసుకుంటున్నారు. ప్రతి ఒక్కరి వద్ద రూ.2500లు అదనంగా తీసుకోవడంతో పాటు ప్రతి వారం చెల్లించే రూ.500లకు వడ్డీ లెక్క కడితే నెలకు రూ.12, నుంచి రూ.13 లు లెక్కన నిరుపేదల నెత్తిన అధిక వడ్డీగ జలగాళ్ల పీడిస్తున్నారు. అధిక శాతం మంది రోజు వారి కూలి చేసుకుని రాబంధుల్లా పీక్కుతింటున్న వారి చేతుల్లో చిక్కొని విలవిల్లాడుతున్నారు. పర్మిషన్ లేని వడ్డీ వ్యాపారులు పేదల జీవితాలతో ఆటలాడుకుంటున్న వీరిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కలర్‌ఫుల్‌గా వైష్ణవి డిగ్రీ కళాశాల ఫెస్ట్

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**




కనిగిరి వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల వార్షికోత్సవ వేడుకలు( కాలేజీ ఫెస్ట్) బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూసాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్సులు, స్కిట్‌లతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు భాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు గయాజ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాల బాలికలను లైంగిక వేదింపుల కేసులో నిందితుడు అరెస్టు

### - డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ వెల్లడి

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



కనిగిరి మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతున్న మైనర్ బాలికపై లైంగిక వేదింపులకు పాల్పడిన కేసులో సైన్స్ టీచర్ దద్దనాల వెంకట రంగారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ దర్యాప్తు చేపట్టి బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం ఒంగోలు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ న్యాయపరమైన మార్గాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ ఘటనపై రాస్తారోకో చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారిపై, ప్రభుత్వ పాటశాల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమించి ఎవరికైనా ఇబ్బంది కలిగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## డాక్టర్ మధుసూదన్ శాస్త్రికి కుర్రా కోటి సూర్యమ్మ స్మారక పురస్కారం

**ఒంగోలు టౌన్, మార్చి 19, ప్రభాతవార్త**



కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని సాహితీ వేత్త డాక్టర్ కప్పగుంతల మధుసూదన్ శాస్త్రికి ప్రదానం చేస్తున్నట్లు శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రబంధ పరమేశ్వరుడు జీవించిన ప్రాంతంలో జన్మించిన డాక్టర్ మధుసూదన్‌శాస్త్రి అసమాన రచనా రీతితో తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చారని, ఉగాది సందర్భంగా తమ మాతృమూర్తి పేరిట జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరిస్తామన్నారు.

## ప్రజాసమస్యలపై ధర్నా

**ఒంగోలు టౌన్, మార్చి 19, ప్రభాతవార్త**




ఇళ్ల పట్టాలు, టిడ్కో ఇళ్లు, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం వైఖరికి నిరసనగా ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 35 డివిజన్‌లలో పర్యటించి ప్రజల అవస్థలు స్వయంగా చూశామని, అధికారుల ఉదాసీనత, పాలకుల వైఫల్యం ప్రజలకు శాపంగా మారిందన్నారు. గత ప్రభుత్వం మల్లేశ్వరపురం దగ్గర ఒక సెంట్ స్థలం కేటాయిస్తూ భరోసా పత్రాలు ఇచ్చారు తప్ప భూమి చూపించలేదని, ప్రస్తుత ప్రభుత్వం రెండు సెంట్ల స్థలం హామీ కార్యరూపం దాల్చలేదన్నారు. చింతల, కొప్పోలు వద్ద టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. మూడు రోజులకు ఒకసారి త్రాగునీటి సరఫరా రాత్రి వేళల్లో ఇబ్బందికరం కాగా శిధిలావస్థలో ఫిల్టర్ బెడ్స్ వున్నాయన్నారు. పోతురాజు కాలువ ఆధునీకరణ ఎప్పటికి పూర్తి అగునో అర్థం కాకుండా వుందన్నారు. అర్జీలతో పేదలు ధర్నాలో పాల్గొంటారని, సమస్యలపై నిలదీయడం ఖాయం అన్నారు. విలేకరుల సమావేశంలో జి.రమేష్, తంబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


**పురపాలక సంఘ కార్యాలయము-చీరాల**

ఆర్.ఓ.సి.నెం.1752/2017/ఎ2 తేది: 19.03.2025

**బహిరంగ వేలము నోటీసు**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు అనగా తేది:01.04.2025 నుండి 31.03.2026 వరకు చీరాల పురపాలక సంఘమునకు చెందిన ఈ దిగువనుదహరించిన మార్కెట్లు మరియు తోపుడుబండ్లు (స్ట్రీట్ వెండర్స్)వారి వద్ద నుండి రుసుములు వసూలు చేసుకొనే హక్కు పొందుటకు తేది: 17.03.2025న వాయిదా వేయబడిన వేలంపాటను తిరిగి తేది:24.03.2025 ఉదయం: 11.00లకు పురపాలక సంఘ కార్యాలయములో బహిరంగవేలం నిర్వహించడును. వేలం పాటలు మున్సిపల్ కమీషనరు గారిచే గాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని జరుపబడును. వేలంపాటను రద్దుచేయుటకు మరియు అవసమైనచో తదుపరి పనిదినములయందు నిర్వహించుటకు కమీషనరు గారికి అధికారము కలిగియుండును.

| వ.నెం | మార్కెట్‌పేరు | దాఖలుచేయవలసిన సాల్వెన్సీరూ. | వేలంపాటలో ముందుగా చెల్లించవలసిన ప్రాథమిక ధరవత్తు రూ. |
|---|---|---|---|
| 1 | నెహ్రూ కూరగాయల మార్కెట్.చీరాల | 10,00,000/- | 10,00,000/- |
| 2 | పేరాల మార్కెట్, | 3,00,000/- | 3,00,000/- |
| 3 | తోపుడు బండ్లు (స్ట్రీట్ వెండర్స్) | 4,00,000/- | 4,00,000/- |

వేలంపాటులో పాల్గొనదలచిన వారు ముందుగా పేన ప్రకటించిన విధముగా సాల్వెన్సీ సర్టిఫికేట్/బ్యాంకు గ్యారంటి/సాల్వెన్సి సర్టిఫికేటు బదులు అంతే విలువగల నగదు మరియు ధరావత్తు సొమ్మును బహిరంగవేలం జరుగు సమయమునకు ముందుగా చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను వేలంపాటలో పాల్గొనదలచిన అర్హత గలిగిన పాటదారులు 2025-2026మార్కెట్ గజిల్‌లోని షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవలెను మరియు అందుకు బద్ధులైవుండవలెను.

మునిసిపల్ కార్యాలయం నందు జరుగువేలం పాట వివరములు మరియు గజిల్‌లోని నిబంధనలు కార్యాలయము పనిదినములలో రెవిన్యూ అధికారి/రెవిన్యూ ఇన్స్పెక్టర్ వారి నుండి తెలిసుకొనవచ్చును.

**కమీషనరు, చీరాల పురపాలక సంఘం**


## మార్చి 31లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్లో నమోదు చేసుకోవాలి

**ముండ్లమూరు, మార్చి 19, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ మండలంలోని శంకరాపురం, నూజిళ్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు అందరూ మార్చి 31వ తేదీ లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్లో నమోదు కావాలని తెలియజేశారు. ఇప్పటి వరకు మండలంలో 9,447 పీఎం కిసాన్ లబ్దిదారులకు గాను కేవలం 5262 రైతులు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ నందు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం యొక్క విధి విధానాల ప్రకారం మార్చి 31వ తేదీ లోపు 75 శాతం పీఎం కిసాన్ లబ్దిదారులను నమోదు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కనుక ఇంకా ఏపీఎఫ్ఆర్ నందు నమోదు కాని రైతులు మీ గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలో 352 కేజీబీవీలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 6,11వ తరగతుల్లో ప్రవేశాల కొరకు 7,8,9, 10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్షనా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు. అనాధలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, బీసీ ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు ఎంపికైనవిద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటీఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు. ఏవైనా సమస్యలు, సందేహాలకు 7075159996, 7075039990 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

## సునీత విలియమ్స్‌కు క్షీరాభిషేకం

**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**



దర్శి నగర పంచాయతీ పరిధిలోని స్తానిక డాక్టర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటీవ్ మెంబరు, మానవత స్వచ్చంద సంస్థ సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గత తొమ్మిది నెలల పాటు కొన్ని సాంకేతికమైన కారణాల వల్ల అంతరిక్షంలో ఉండి ఈ రోజు మన భారత కాలమానం ప్రకారం 3.50 గంటలకు సముద్రంలో దిగ్విజంయగా దిగి, ప్రపంచానికి ఆదర్శవంతంగా నిలిచిన మన భారత సంతతికి చెందిన అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) పరిశోధకులు సునీత విలియమ్స్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి వక్తలందరూ కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తహశీల్దార్ కార్యాలయ పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, కపురం శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొని సినిమా విలియమ్స్ గురించి చక్కగా ఉపన్యసించి విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిలించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బంది, దరిదాపు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి - దర్శి ఎస్సై

**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**



దర్శి పోలీసు స్టేషన్ పరిధిలో ఇండ్లకు, వ్యాపార సంస్థలకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బుధవారం ఎస్సై ఎం.మురళి సూచించారు. దొంగతనాలు ఎప్పుడు ఏ సమయంలో జరుగుతాయో తెలియదని, అందుకు అనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి చోట సీసీ కెమెరాలు ఉన్నట్లయితే అక్కడ పోలీసు సిబ్బంది ఉన్నట్లేనని తెలిపారు. కనుక అందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## వైసీపీ చేసిన తప్పే కూటమి చేస్తుంది

**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వంపై దర్శి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నాటి పథకాలు, జిల్లాల పేర్లను ఇప్పుడు మార్చడాన్ని ఖండిస్తూ ఇది సరైన పద్దతి కాదన్నారు. గతంలో ఎన్టీఆర్ పేరు వైసీపీ మార్చి చేసిన తప్పే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. వైఎస్సార్‌ను తెలుగు ప్రజలు దేవుడిలా పూజిస్తారని, రాత్రికి రాత్రే వైఎస్సార్ పేరును తీసేయడం ఏంటని మండిపడ్డారు. వైఎస్సార్‌ను తీవ్రంగా అవమానించారన్నారు.

## ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలో ప్రముఖ ముస్లిం సోదరులు అల్లాబక్షు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ. ఈ కార్యక్రమంలో దర్శి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, సోదరులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేసిన గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**



దర్శిలోని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేయటం జరిగింది. వారితో పాటు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మండల పార్టీ అధ్యక్షులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 53వేల టీడీపీ సభ్యత్వ కార్డులను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండిదర్శికి పంపించటం జరిగింది. ఈ సభ్యత్వ కార్డులను మండలాల వారీగా మండల పార్టీ అధ్యక్షులు క్లష్టర్, బూత్ ఇన్‌ఛార్జీల ల ద్వారా ప్రతి గ్రామంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మరొక్కసారి తెలుగుదేశంపార్టీ సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం పార్టీ సైనికులకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ జవావ్యవసాత్వాలు మీరేనని ఆమె కొనియాడారు. పార్టీ కుటుంబ సభ్యులైన మీ అందరికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అందుకు మీకు భరోసా ఇస్తునానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, మిడతల నమిలయ్య, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, యాదగిరి వాసు, సీనియర్ నాయకులుశేఖర్ పంతులు,మాజీ ఎంపీపీ మందలపు వెంకటరామయ్య, కాట్రాజు నాగరాజు, మాజీ జడ్పీటీసీ నాగరాజు, చెంచయ్య, రమణారెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మర్లపాడు, కందులూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది

**టంగుటూరు, మార్చి 19, ప్రభాతవార్త**



మండలంలోని మర్లపాడు, కందులూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రతిఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఏ.శైలజ మాట్లాడుతూ వేసవి దుక్కులు గురుంచి శనగ పంటలో ఎండు తెగులు రాకుండా విత్తనము నాటేముందు పొలంలో తెగులు నివారణకు భూమిలో ట్రైకో డెర్మా విరిడి శిలీంద్రమును వృద్ధి చేసే విధానం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఏ.శ్రీనివాసరెడ్డి, ఉద్యాన శాఖ సహాయకులు సీహెచ్ సుజాత, విస్తరణ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కనిగిరి టూరిజం అభివృద్ధిపై టీడీపీ శ్రేణుల విజ్ఞప్తి

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గంలో పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రకాశం జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మోరబోయిన గంగరాజుయాదవ్, అష్రఫ్ రైస్ ట్రేడర్స్ అధినేత షేక్ చిన్న హాజీ మలన్, నూకసాని బాలాజీని మర్యాదపూర్వకంగా కలుసుకొని సన్మానించారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు భైరవకోన, మోపాడు రిజర్వాయర్‌లను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన నూకసాని బాలాజీ, భైరవకోన అభివృద్ధికి రూ.50లక్షలతో డీపీఆర్ సిద్ధం చేసి పర్యాటక శాఖ కమీషనర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు మామీ ఇచ్చారు. అదే విధంగా మోపాడు రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, బోట్ షికార్, రిసార్ట్స్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్దం చేస్తున్నట్లు బైరెడ్డి వెల్లడించారు.

## అర్బన్ ఆరోగ్య కేంద్రం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



అర్బన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం ఇందిరా కాలనీలో రూ.80లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ పనులను ఆయన పరిశీలించారు. దేవాంగనగర్ పనులను ఆయన పరిశీలించారు. దేవాంగనగర్‌లోని మరో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన నేపథ్యంలో అదనంగా రూ.35లక్షలు ప్రత్యేక నిధులుగా మంజూరు చేయించామని, టెండర్ పక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక కృషితో అర్బన్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ కోటేశ్వరరావు, ప్లానింగ్ కార్యదర్శి నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## చింతలపాలెం పరీక్షా కేంద్రంలో జోరుగా కాపీయింగ్

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం పదో తరగతి పరీక్షా కేంద్రంలో అట్టహాసంగా కాపీయింగ్ జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష కేంద్రంలో పలు గదుల్లో ఇన్విజిలేటర్లు తమ విధులను పట్టించుకోకపోగా, కొందరు స్వయంగా కాపీయింగ్‌కు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పరీక్ష ముగిసే చివరి అరగంట సమయంలో కాపీయింగ్ మరింత ఊపందుకుంటుంది. కొన్ని గదుల్లో ఇన్విజిలేటర్లు స్వయంగా కాపీలు అందజేస్తున్నారని, ఈ పరిస్థితి విద్యావ్యవస్థపై మచ్చ వేస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కాపీయింగ్‌ను అరికట్టాలని, తప్పిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌బృందాలను నియమించాలని, పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సచివాలయాలన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

సచివాలయం ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం కనిగిరి పట్టణంలోని ఒకటో సచివాలయంను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆకస్మికంగా తనిఖీ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారిగా పని చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలతో మమేకమై వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకొని క్షేత్ర స్థాయిలో పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. సచివాలయం ఉద్యోగులు ప్రతి రోజు యూనిఫామ్ ధరించి సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన తెలియజేశారు.

## బీసీలు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలి

### - రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసనశంకరరావు

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**




వెనుకబడిన కులాలకు చెందిన వారు వ్యాపార రంగంలో అభివృద్ధి చెంది వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్‌రావు అన్నారు. బుధవారం పొన్నలూరు మండలం వెల్లటూరు గ్రామంలో జరిగిన వాణిజ్య విభాగ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, కార్యదర్శి ఈర్ల విజయరామరాజును ఘనంగా సన్మానించారు. ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బలగాని ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సోమయాజులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంది, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక చేయూత అందిస్తూ వ్యాపార రంగంలో రాణించేలా చర్యలు తీసుకోవాని వారు సూచించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తుందని, ఈ వాణిజ్య విభాగ సదస్సు ద్వారా బీసీ వ్యాపారవేత్తలు పరస్పర అనుభవాలను పంచుకుని అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో బీసీల వ్యాపార అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు.

## గృహ నిర్మాణ లబ్దిదారులకు అదనపు సాయం

### - హౌసింగ్ డీఈఈ కోటిరెడ్డి

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



గృహ నిర్మాణ లబ్దిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ, ప్రతి లబ్దిదారుడు దీనిని వినియోగించుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ కోటిరెడ్డి సూచించారు. బుధవారం కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ ఏడో సచివాలయంలో లబ్దిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ.50వేలు ఎస్టీ లబ్దిదారులకు రూ.75వేలు, అలాగే పర్వతప్రాంత షెడ్యూల్ తెగలకు లక్ష రూపాయలు అదనపు సాయం అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి లబ్దిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈ ముసలయ్య, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ షంషీర్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ పేరు తొలగించటం అన్యాయం - దద్దాల

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



విశాఖ స్టేడియానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు తొలగించడం అన్యాయమని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వాకంతో బ్రాండ్ ఏపీ అనేది పాతాళంలోకి పడిపోయిందన్నారు. పేర్లు మార్పు మీద చూపే శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధి మీద లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక హెల్త్ యూనివర్సిటీ, వైఎస్సార్ జిల్లా పేర్లను కూడా మార్చారని అన్నారు. దీని వలన ఏం సాధించారో వారికే తెలియాలని ఫైర్ అయ్యారు. వైఎస్ జగన్ తెచ్చిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయటం తప్ప చంద్రబాబు చేసిందేమి లేదని ఆక్షేపించారు. వాళ్లు చెప్పే ప్రాజెక్టులు, అభివృద్ధి అంతా కాగితాల మీదే ఉందని ఎద్దేవ చేశారు. ఫలకాల మీద పేరు తొలగించినా జనం గుండెల్లో నుంచి వైఎస్సార్ పేరును తొలగించలేరని దద్దాల నారాయణ యాదవ్ హెచ్చరించారు.

## శత్రువుకు శత్రువు మిత్రుడేనా

**ఒంగోలు టౌన్, మార్చి 19, ప్రభాతవార్త**

ఏడాదిలో నగర పాలక సంస్థ ఎన్నికలు ఉండటంతో కూటమి నేతలు తడబడుతూ జనానికి వినోదం పంచుతున్నారు. అధినేతలు సంయమనం కోల్పోయి వ్యవహరించాక ద్వితీయ శ్రేణి వాలకం అర్థం చేసుకోవచ్చు. బాలినేని, దామచర్ల కాస్త తగ్గినా వీళ్ల హడావిడి తగ్గలేదు. ప్రారంభంలో ఫ్లెక్సీలు పీకడం, ఇప్పుడేమో విగ్రహాలకు జెండాలు మార్చడం. ఇంకా రెచ్చిపోతూ దూషణలకు దిగి కొట్టుకునే దాకా. శత్రువుకు శత్రువు మిత్రుడేనా మీమాంసలో ద్వితీయ శ్రేణి గణం వుండటంతో కార్పొరేషన్ అభ్యర్థుల ఎంపిక రసవత్తరం అని చెప్పాలి. రోజురోజుకు కొత్త గ్రూప్‌లు తయారవుతుండటం అధినేతలకు తలనొప్పిగా మారింది. కాలానుగుణంగా రాజకీయాలు ఉన్నప్పటికి ప్రశాంతత లేకుండా చేయడం సరికాదని, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జనం భావిస్తుండటం గమనార్హం.

